
# మబ్బులు



'విశాలాంధ్ర' దినపత్రిక 'ఆదివారం అనుబంధం' . . . 19 ఫిబ్రవరి' 2006

శ్రీకాకుళం

'అవిభక్త కవలలు' ఎందుకు జన్మిస్తారు?

వాళ్ళని కనడానికి ఆ కన్నతల్లి ప్రసవ వేదనను ఎంతగా అనుభవించి ఉంటుందో?!

ఆ ఇద్దరు శిశువుల శరీరాలు మమేకమై పుట్టారు.

చూడ్డానికి చక్కగా, అందంగా, ముద్దొస్తున్నారు. ఇద్దరూ ఏడుస్తున్నారు ఉన్నట్టుండి! ఒకేసారి బోసినవ్వులతో ఆలకిస్తున్నారు... పాలు త్రాగుతున్నారు.

ఒకరిని విడిచి ఒకరు ఉండలేని శారీరక స్థితి వాళ్ళది! ఎందరో డాక్టర్లు వచ్చిచూస్తున్నారు. పెదవి విరిచి పోతున్నారు.

శరీరభాగాలు కలిసి జన్మించిన కవలలను విడదీయడం అయ్యే పనేనా? అరకొర సౌకర్యాలతో అంతగా పురోగతి సాధించని సమయంలో ఎంతవరకు ఆపరేషన్ చేసి వాళ్ళిద్దరినీ విడదీయవచ్చు?

ఎందరో చూసి పెదవి విరిచిన కేస్‌ని తను భుజాన వేసుకున్నాడు. తన డాక్టర్ వృత్తికి అది ఓ సవాల్‌గా భావించాడు. వారి శరీరభాగాలను విడదీయడం కోసం అహోరాత్రులు శ్రమించాడు. ఎందరినో సంప్రదించాడు. ఎన్నో వైద్యగ్రంథాలను తిరగేశాడు. ఎంతోమంది సీనియర్ సర్జన్‌ల సలహాలు తీసుకున్నాడు.

చివరికి తన కృషి, పట్టుదల ఫలించాయి!

ఆ అరుదైన శస్త్రచికిత్స గురించి ఎంతోమంది గొప్పగా చెప్పుకున్నారు. మీడియా తననో అపురూపమైన సర్జన్‌గా చిత్రించి ముందుపేజీలలో బాగా వ్రాసింది.

అంతటా ప్రశంసల వెల్లువ...

ఎక్కడకు వెళ్లినా ఆకాశానికి ఎత్తేస్తున్నారు...

పురస్కారాలు... సన్మానాలు... అభినందనలు... సత్కారాలు!

'అభివృద్ధి చెందిన దేశాలతో సరిసమానంగా వైద్యరంగంలో మనదేశ కీర్తిప్రతిష్టలను పెంపొందించిన మేధావి' అంటూ తనను అభినందిస్తూ దేశ పార్లమెంట్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ఇప్పుడు దేశం మొత్తానికే తలమానికమైన ఓ అరుదైన డాక్టర్ తను.

ఆ ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతుండగానే...

చటుక్కున మెలకువ వచ్చింది పీటర్‌కి.

●

'ఓహ్‌... ఎంత మధురమైన కల!'

అభినందనలు... పురస్కారాలు... దేశ పార్లమెంట్‌లో ప్రత్యేకమైన ప్రశంసాతీర్మానం!

ఆ కల నిజమైతే ఎంత బాగుండు?!

అవును... ఆ స్థాయికి ఎదుగుతానన్న నమ్మకం తనకుంది. రేపు తనది... అయినా హౌస్‌సర్జన్ అయింది కూడా ఇప్పుడే కదా! మున్ముందు డాక్టర్‌గా తాను చెయ్యాల్సింది ఎంతోవుంది.

ఆ ఊహ పీటర్‌ని చిరుగాలిలా స్పృశించి స్పందింపజేస్తోంది.

నున్నటి తారురోడ్డు మీద వేగంగా పోతోంది ఆర్టీసీ బస్సు! ఎలక్ట్రిక్ పోల్స్‌ని, టెలిఫోన్ తీగల్నీ, దూరాన చెట్టుచేమల్నీ వెనక్కి వెనక్కి నెట్టేసుకుంటూ ముందుకు పరుగుతీస్తోంది.

డ్రైవర్‌కి పాత సిన్మా పాటలంటే ఇష్టమనుకుంటా...

'కారులో షికారు కెళ్లే పాలబుగ్గల పసిడీదానా...' ఘంటసాల వారి నోట పలుకు పరవశింపజేస్తోంది. అసలే డిసెంబరు నెల! చల్లని శీతల పవనం ఉండుండి మేనుని తాకి పరవశింపజేస్తోంది.

ఒక్కసారి కళ్ళుమూసుకొని వెనక్కి జారగిలపడ్డాడు పీటర్. ఆత్మీయమైన అంశమేదో అంతరంగాన్ని తాకి ఆనందంతో ముంచెత్తుతోంది. టైము చూసుకున్నాడు. మరో గంటలో ఆ ఊరును చూడబోతున్నాడు. దాదాపు పది సంవత్సరాలయింది... ఆ ఊరును వదిలేసి!

నాన్నకు ఆ ఊరులో ఉద్యోగం కావడంతో గుదిబండ గ్రామంతో గాఢత ఏర్పడింది పీటర్‌కి. చల్లని గాలి, పరవళ్ళు తొక్కుతూ పారుతున్న ప్రవాహం, ప్రేమానురాగాల్ని పంచి ఇచ్చే మనుషులను తలచుకుంటే చాలా హాయిగా వుంది. చిన్న చదువులు సైతం రోజూ ప్రక్క ఊరు ధేనువుకొండ వెళ్లి చదువుకోవాల్సివచ్చేది. ఉదయాన్నే సైకిలు మీద బయలుదేరి పిల్లలందరూ సాయంత్రానికి ఇంటికి చేరేవారు.

పీటర్, బాలాజీ, రసూల్ ఎప్పుడూ కలిసి తిరిగేవారు. ఒకే క్లాసు కావడంతో ఎప్పుడూ ఒకటిగా ఉండేవారు. ఇప్పుడు వాళ్ళు ఎలా ఉన్నారో..?! చూసి చాలాకాలం అయింది. ఆరోజుల్లో కృపవరం పంచాయితీ గుమాస్తాగా పనిచేసేవాడు. చేసింది చిన్న ఉద్యోగమైనా కొడుకు భవిష్యత్ పట్ల ఆయనకు ఖచ్చితమైన ప్రణాళిక ఉండేది. అందుచేతనే ఈనాడు పీటర్ డాక్టర్ కోర్సు పూర్తి చేయగలిగాడు.

తద్భిన్నంగా బాలాజీ, రసూల్‌లు చదువు మానేసి ఇప్పుడు ఏదో చిన్న వ్యాపారాల మీద పడ్డారు. చాలా సంవత్సరాలు చిన్ననాటి స్నేహితులను చూడకపోయినా లెటర్స్ ద్వారా, ఫోన్ ద్వారా వాళ్ళతోటి చెలిమి ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

"ఒరేయ్ఁ... పీటూ! మన ప్రెసిడెంట్‌గారమ్మాయి ప్రజ్ఞ డిగ్రీ పాఠాలలో ప్రజ్ఞ కనబరచలేదుగాని ప్రేమపాఠాలలో మాత్రం కనబరుస్తోంది."

"బియ్యం కమీషను వ్యాపారం చేసే భీమనాథం పెళ్ళాం పోవడంతో రెండోపెళ్ళి చేసుకున్నాడు!" అంటూ ఊరులోని ప్రతి విషయాన్నీ ఏకరువు పెడుతుండేవారు.

"ఒరేయ్ఁ... పీటర్! ఈసారి క్రిస్టమస్ పండుగని గుదిబండలో మనందరం కలిసి జరుపుకుంటున్నాం! నువ్వు పెద్ద డాక్టర్‌వని తెలుసులేవోయ్!! కానీ, మాకు మాత్రం పాత పీటూగాడివే. నువ్వు రావాలి... వస్తున్నావంతే!" అంటూ రసూల్ వ్రాసిన ఉత్తరం ఉత్తేజాన్నిచ్చింది. ఎప్పటినుంచో ఆ ఊరును చూసిరావాలనుకుంటున్నాడు. ఓ రెండురోజులు పోయివస్తే వాళ్ళు సంతోషిస్తారు.

బస్సు గతుకుల రోడ్డును వదిలి తారురోడ్డు మీదకు మళ్లింది. పచ్చదనంతో నిరంతరం హృదయంలో పరిమళించే ఆ ఊరి జ్ఞాపకాలు పీటర్‌కి జీవనోత్సాహాన్ని కలిగిస్తూనే వున్నాయి.

ఓ అందమైన జీవితం...

అందరూ కావాలనుకునే రైళ్లూ, కారులు, జనం గుంపులు, క్లబ్బులు, సినిమాలు, వినోదం లేకపోవచ్చు. ఎత్తయిన కొండలు, ఎదిగి ఆకాశాన్ని అక్కున చేర్చుకుంటున్న పర్వతశ్రేణులు, వాటి

నడుమ మేతమేయడానికి సమాయత్తమవుతూ నల్లని మేలిముసుగును ధరించి ఆక్రమిస్తున్న మబ్బుల గుంపులు, ఇరుకైన కొండల మధ్య అగాథాలు, ప్రకృతి వేధింపులకు అరిగి ఒక్కోమారు కృశించి, పదును దేలిన సూదంటురాయిలా ఆకాశంలోకి చొచ్చుకుపోయే కొండశిఖరాలు, వాటి మీద కొండనంతటినీ ఆకుపచ్చబట్టతో కప్పేసినట్లున్న ఆకుపచ్చని పరిసరాలు, ఆహ్లాదానికి సంకేతమంటూన్న హరితహర్మ్యాలు, అభాగ్యుల జీవనబాటలా విరిగి లోయలోకి జారిన బండరాళ్లు!

మెలికలతో, ఒంకీలతో ఎక్కడికక్కడే ఆవిరైపోయి ఇట్టే పుట్టి, అట్టే జారిపోయినట్టుండే పిల్లకాలువలూ... ఈనాటి పట్నవాసాన్నీ, వాటి మనుషుల్నీ మరిపించి జీవితాంతం ప్రకృతిని ప్రేమించేవాడికి- గతాన్ని గౌరవించేవాడి ఆ ఊహ అంతా ఒక స్వర్గంలా అనిపిస్తోంది.

తారురోడ్డు మీద పరుగెడుతూన్న బస్సుకు బర్రె అడ్డంగా రావడంతో డ్రైవరు సడన్‌బ్రేక్ కొట్టాడు. చిన్నకుదుపుతో ఆగిపోయింది బస్సు.

కిటికీలోంచి బయటకు చూశాడు పీటర్... ఏదో ఊరు!

పరికించి చూశాడు...

అవును... అది ధేనువుకొండ!

తనకు బాగా పరిచయమున్న ఊరు. తాము రోజూ సైకిలు త్రొక్కుకుంటూ వచ్చి చదువుకున్నది ఆ ఊరు స్కూల్‌లోనే.

ధేనువుకొండ దాటిందంటే సరిగ్గా పావుగంటలో గుడిబండ వచ్చేస్తుంది. పాత స్నేహితులతో పంచుకోబోయే మధుర ఘడియల కోసం మనసులో ఎంతో ఉత్సాహం పీటర్‌కి.

ఏం తోచడం లేదు. ప్రక్కనేవున్న బ్యాగ్ సైడ్ పాకెట్‌లోంచి 'ఇండియా టుడే' బయటకు తీశాడు.

'అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు మూడు నెలల వాయిదా!' చదివిన వార్త అయినా మళ్లీ చదవాలనిపించే విషయం అది.

'అయోధ్య సమస్య... రామ జన్మభూమి- బాబ్రీమసీదు వివాదం... ఇరుపక్షాల వారి వాదనలు... ప్రతివాదనలు... డిమాండ్లు... న్యాయమూర్తుల వాదనలు పరిశీలించిన తరువాత జడ్జి వాయిదా వేయడం...' ఆలోచనలో పడేస్తున్నాయి పీటర్‌ని.

'అంతవరకు ఎంతో మతసామరస్యం నెలకొన్న ఈ సువిశాల దేశంలో స్వార్థం, సంకుచిత ధోరణులు జడలు విప్పుకొని సున్నితమైన అంశాన్ని జటిలం చేసిపారేస్తున్నాయి. తద్వారా వివిధ వర్గాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధాలకు తెరతీస్తున్నాయి. మత దురహంకారాలు ప్రజ్వరిల్లడం... తద్వారా ఒక మతస్తుని మీద మరొకరి దాడి... చంపుకోవడం... నరుక్కోవడం.. ఆలోచిస్తున్న పీటర్ అంతరంగం భారంగా నిట్టూర్చింది.

లేకపోతే విద్యా వైజ్ఞానిక రంగాలలో ఎంతో పురోగమించే వర్తమాన కాలంలో కులాల పేరిట, మతాల పేరిట మనుషుల మధ్య గోడలు నిర్మించుకోవడం, విచ్ఛిన్నకరంగా ప్రవర్తించటం... చదువుతూంటే విచారకరంగా అనిపిస్తోంది.

ఒక్కసారి భగవంతయ్య, బాషా మనసులలో మెదిలారు. గుడిబండలాంటి చిన్న ఊరిలో వాళ్ళు అప్పట్లో ఎంతో మతసామరస్యాన్ని సాధించారు. ఒకరి పండుగలలో ఒకరు... ఒకరి కష్టసుఖాలలో మరొకరు... ఏకత్వమే గాని భిన్నత్వమనేది మచ్చుకైనా కానరాని ఊరు.

ఆనాటి గోకులాష్టమి పండుగ బాగా గుర్తు పీటర్‌కి!

భగవంతయ్య ఆధ్వర్యంలో 'పెరుగు ముంత' చాలా చక్కగా ఏర్పాటు చేయబడింది. బాషా ఆ కార్యక్రమం మొత్తాన్ని పర్యవేక్షిస్తున్నాడు.

దాదాపు ఊరు ఊరంతా అక్కడే వుంది. బలమైన పచ్చి వెదుళ్ళతో కట్టిన గోకుల పందిరి, మధ్యలో గిలక... దానిలో కొబ్బరితాడు... ఓ చివర పాలు పెరుగులతో నింపి... చిల్లర పైసలు వేసి... పైన కొబ్బరికాయ అమర్చి... పూలతో అలంకరించిన 'ఉట్టి' అది!

ఆ పండగలో ఉట్టి కొట్టడమనేది ప్రతిష్టాకరమైన అంశం. చూడ్డానికి పొరుగు ఊళ్లనుంచి కూడా తరలివచ్చేవారు.

ఒకప్రక్క బాషా తాడు లాగుతుంటే... భగవంతయ్య జనాన్ని లైనులో నిలబెట్టి ఒకరితర్వాత ఒకరుగా వదులుతున్నాడు.

కవ్విస్తూ నవ్విస్తూ... అందీ అందని ఉట్టి– పైకీ, కిందికీ కదులుతోంది. కొట్టబోయేవాళ్ళ మీద రంగునీళ్లు పిచ్చికారి చేస్తున్నారు మరికొందరు.

అంతా సందడే సందడి!

ఉట్టి కొట్టడానికి ప్రయత్నిస్తున్న చాలామందిలో పీటర్ ఒకడు. పరుగున వచ్చి ఎగిసి పైకిపోతూన్న ముంతకు కొట్టలేక వెనుదిరిగి పోతూనేవున్నాడు.

భగవంతయ్య, బాషా ఉత్సాహం అంతా తామై అందర్నీ ముందుకు ఎగదోస్తున్నారు. కృపవరం ఎదురువచ్చి కీ కొట్టకుండా చూస్తున్నాడు.

ఒక్కసారి అంతా నిశ్శబ్దం..!

మనసు నిండా స్ఫూర్తిని కూడగట్టుకొని... గుండెల నిండా ఊపిరి పీల్చుకొని... కళ్ళను, దృష్టిని ఉట్టిమీదే నిలిపి... ఛెంగుఛెంగున పరుగెత్తి... ఒక్కసారి గాలిలోకి ఎగిరి.. పైకీ క్రిందకీ కదులుతూ కవ్విస్తూన్న ఉట్టిని 'భళ్' మనిపించాడు పీటర్.

"భళారీ..!" అన్న శబ్దం... సంతోషంతో అరుపులు, కేకలు!

ఉట్టి పగిలిపోయింది! ఉట్టిలోని పెరుగు, పాలు, పైసలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఏరుకొనేందుకు పోటీలు పడుతున్నారు. బాలాజీ, రసూల్ వచ్చి పీటర్‌ను కౌగిలించుకొని భుజానికి ఎత్తుకున్నారు. అంతా పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఆనాటి హీరో తానయ్యాడు పీటర్. ఆ ఊరికి సంబంధించిన ఆ అనుభూతుల్ని ఎప్పటికీ మరువలేడు తాను.

చలిగాలి రివ్వున వీస్తుంటే కిటికీలోంచి తల బైటకు పెట్టి ఆకాశం కేసి చూశాడు. కరిమబ్బు లేస్తోంది... సన్నని తుంపర మొదలైంది. ఈదురుగాలికి చినుకులు చెదిరి కిటికీలోంచి పీటర్ ముఖం మీద పడుతున్నాయి. ఆడి ఆడి అలసిపోయిన కుర్రాడి ముఖాన్ని చల్లటినీటితో కడిగి, పమిట చెంగుతో తుడుస్తూన్న 'అమ్మస్పర్శ'లా అన్పించింది.

వాన తుంపరలతో భూమి పైపొర పులకించిందనుకుంటా... మట్టివాసన ముక్కుపుటాలను తాకుతోంది. దశాబ్దం గడిచిపోయినా పీటర్ గుర్తుపట్టగలడు... ఆ వాసన గుడిబండ గడ్డనుండి వచ్చినదే.

పరికించి చూశాడు.. గుడిబండ వచ్చేసింది. బస్సు చిన్న చిన్న జర్క్‌తో ఆగిపోయింది. హుషారుగా క్రిందకు దిగాడు.

ఎదురుగా బాలాజీ రసూల్ కన్పిస్తున్నారు.

చిత్రంగా చినుకులు ఆగిపోయాయి.

"ఏరాः... పీటుగా- ఎన్నాళ్లకురా!!" బాలాజీ అమాంతం వాటేసుకున్నాడు.

"డాక్టర్ పీటుగాడికి అప్పుడే కొమ్ములొచ్చేశాయిరా... లేకపోతే, అప్పుడంటూ, ఇప్పుడంటూ ఇంతకాలం..!" రసూల్ నిష్ఠూరానికి పకపకా నవ్వుతున్నాడు పీటర్.

ఆ నవ్వులు, కేరింతలు చాలా బాగున్నాయి.

దండుబాట గుండా నడచి వెలుతుంటే ఆనాటి రామదండు గుర్తుకువచ్చింది. పీటర్ పెదాల మీద చిన్న చిరునవ్వు కదలాడింది.

"నీలో నువ్వే నవ్వేసుకోనక్కర్లేదు... మాకూ కొంచెం పంచు!" బాలాజీ నిలదీశాడు.

"అదేలేరా! రామదండు నరసింహం మాస్టారు గుర్తుకువచ్చారు!"

"ఆనాడు హైస్కూలులో చదువుతున్నప్పుడు ఎన్.సి.సి. నరసింహం సారు- పిల్లలందర్నీ రామదండును చేసి చుట్టుప్రక్కల గ్రామాలలో దండుబాటు బాగుచేయించాడు. అప్పట్లో నడవడానికి అస్సలు అనుకూలత లేదు. పదిహేను రోజులు పిల్లల శ్రమదానం పుణ్యమా అంటూ దండుబాట బాగుపడింది. తర్వాత ఈమధ్య సిమెంట్ రోడ్ వేశారు..."

- రసూల్ చెప్పుకుపోతున్నాడు.

గుడిబండ నుండి ధేనువుకొండ స్కూలుకి సైకిలు మీద వెలుతూంటే ఒక్కోసారి టైర్లు పంచెర్లు పడేవి. దానితో ప్రక్కవాడి సైకిల్ మీద కూర్చునే పంచరైన సైకిలుని పట్టుకొచ్చేవారు.

- తలచుకుంటే చాలా సరదాగా అన్పిస్తోంది పీటర్‌కి.

ఊరులో పెద్ద మార్పు ఏమీ లేదు. రోడ్లు మటుకు బాగుపడ్డాయి. డబ్బున్నవాళ్ళ కొంపలు మాత్రం పెంకుడు లోగిళ్ళ బదులు- పక్కా బిల్డింగ్‌గా తయారయ్యాయి... అంతే!

"మన పంచాయతీ ఆఫీసు కృపావరంగారబ్బాయి... డాక్టరయి వచ్చాడు!" ఎదురొస్తున్న మరోచలం మాష్టారికి పరిచయం చేస్తూ అన్నాడు బాలాజీ.

"మీ నాన్న మంచివాడోయ్! పంచాయతీ ఆఫీసులో పనులకని వెళ్తే క్షణంలో చేసిపెట్టేవాడు!!" మెచ్చుకోలుగా అన్నాడాయన.

ఆనందంగా ముందుకు కదిలాడు పీటర్.

"మర్చిపోయా... హుస్సేన్ తాత ఎక్కడున్నాడిప్పుడు?"

"ముసలాడయిపోయాడు కదా! మిషను కుట్టడం మానేసి కొడుకు దగ్గరకు పట్నం వెళ్లిపోయాడు. ఆరోజుల్లో ఆ గ్రామంలో ఉన్న ఏకైక టైలరు హుస్సేనుసాయిబు. ఆడాళ్ళకు, మగాళ్ళకు అతనే టైలర్! అందరూ తనకు సమానమన్నట్లు మగాళ్ళ బట్టలన్నింటినీ ఒకే కొలతలతో కుట్టిపడేసేవాడు. చిన్నా,పెద్దా తేడా లేదు. ఎలా కుట్టినా అందరూ సరిపెట్టుకొని తొడుక్కునేవారు. అలా సర్దుకుపోవడం వారి సెంటిమెంట్ కూడానూ. ఇక ఆడవాళ్ళయితే సరేసరి! జాకెట్లు, లంగాలు కుట్టించుకోవడానికి ఆదిబట్టలు తెచ్చి ఇవ్వడానికి సిగ్గుతో మెలికలు తిరిగిపోయేవారు."

రోడ్డుమీద కన్పించిన అందరికీ పీటర్‌ని పరిచయం చేస్తున్నారు వాళ్ళు.

బాలాజీ, రసూల్‌ల మాటలలో ఆప్యాయత, అభిమానం స్పష్టంగా కన్పిస్తున్నాయి. అక్కడ టీ త్రాగుతున్నవాళ్ళంతా తమ ఊరి డాక్టర్ కుర్రాడిని వింతగా చూస్తున్నారు.

"కాలవగట్టు మీద హోటల్ వెంకమ్మ టీబడ్డీ ఇంకా ఉందన్నమాట!" పండగల సమయంలో రాత్రిపూట చీట్లపేకాట ఆడుతున్నప్పుడు మధ్యలో వెంకమ్మ హోటలు ఇడ్లీ ప్రత్యేక ఆకర్షణ గుర్తుకువచ్చి చిన్నగా నవ్వు వచ్చింది పీటర్‌కి.

"వెంకమ్మ ఏదీ..?!" అడిగాడు కౌంటర్ దగ్గర కూర్చున్న కుర్రాడిని.

"ఇంకెక్కడి వెంకమ్మ... వెంకమ్మ వెంకటేశ్వరస్వామిలో కల్సిపోయింది... నాలుగేళ్లు అయింది!"

పీటర్ మనసు చివుక్కుమంది.

"అవున్రా! వెంకమ్మ చచ్చిపోయింది. ఆవిడ పేరు మీద హోటల్ మరొకడు నడుపుతున్నాడు!" చెప్పుకుపోతున్నాడు బాలాజీ.

'స్పెషల్ టీ తీస్కోండి సార్!" కొట్లో కుర్రాడు గ్లాసు అందించాడు.

వద్దని వారించబోయాడు పీటర్.

"తీస్కోవోయ్‌ఁ... అవడానికి డాక్టరువయినా గుదిబండకు పీటర్ గాడివే... గుర్తుంచుకో!" రెట్టించాడు రసూల్.

"అయ్యో! డాక్టరు బాబుని అంతమాట..." ఒకింత కంగారుగా అంది- పెనం మీద అట్లకాడతో అట్టు తిరగేస్తున్న పుష్పలత.

"వీడు మీకు డాక్టరు గాని... మాకు డాక్టరేమిటి? ఏరా?!"

బాలాజీ మాటలు పులకింతకు గురిచేస్తున్నాయి పీటర్‌ను.

"అవును... నువ్వే నేను!" అన్నాడు లోలోపల ఆర్తిని నింపుకున్న మనస్సుతో.

బాలాజీ, రసూల్ తన చిన్నప్పటి స్నేహితులు. కలిసి తిరిగినప్పుడు, కలిసి కొట్టుకున్నప్పుడు, చిలిపి తగాదాల తర్వాత కలిసిపోయినప్పుడు... వర్షం వెలసిన సాయంత్రంలా ఉండేది ఆ స్నేహం! చాలా చల్లగా, హాయిగా మధురిమగా అన్పించేది. సాయంత్రానికి ఆవల వెన్నెల కురిసిన పౌర్ణమి రాత్రిలా.

'కానీ, పెద్దగా చదువుకోలేకపోవడం... వాళ్ళ కారణాలు ఏమైనా కావచ్చు!' చిన్నగా నిట్టూర్చాడు.

"అవునూఁ... మన ఊరి పెద్దయ్యల సంగతులు చెప్పరేరా!"

"అదా... ఓ పెద్ద చరిత్రలేరా! ఇప్పుడు భగవంతయ్య, బాషాల మధ్య పచ్చగడ్డే కాదు, ఇనుప గడ్డి వేసినా భగ్గుమంటుంది."

రసూల్ కళ్ళలోకి చూశాడు.

"అవును. మన రచ్చబండ తెలుసు కదా... దానిప్రక్కన పోరంబోకు ఉంది చూశావూఁ... అది ఊరి ఉమ్మడి స్థలం! అక్కడ 'శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి కట్టా'లని భగవంతయ్యకు... 'కుదరదు మసీదు నిర్మించి తీరాల్సిందే'నన్నది భాషా పట్టుదల. ఆ దిశగా వారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒకప్పటి ప్రాణస్నేహితులు కాస్తా బద్ధశత్రువులుగా మారిపోయారు. ఐకమత్యానికి ప్రతీక అనుకొనే పల్లెటూరులో ఈనాడు రెండు గ్రూపులు... ఆధిపత్యపు పోరు... తగాదాలు... రాజకీయపార్టీల సపోర్టు..."

'పట్టణ సంస్కృతి పల్లెలకు కూడా పాకిందన్నమాట!' తనలో తానే అనుకున్నాడు పీటర్.

"అవును. అనేక ఇతర అంశాలకు అతీతంగా మానవతా అంశానికే ప్రాధాన్యత నిచ్చేవారప్పుడు. ఊరులో ఎంత ఐకమత్యం కన్పించేది! ప్రజలు సుఖశాంతులతో ఎంత పారవశ్యంగా ఉండేవారు... అంతా కాలమహిమ!"

ఇందాక బస్సులో 'ఇండియా టుడే' పత్రికలో చదివిన రామ జన్మభూమి, బాబ్రీ మసీదు అంశం గుర్తుకొచ్చింది. అటువంటి సున్నితమైన అంశాలే ప్రజలను ప్రభావితం చేసి మత సామరస్యానికి గొడ్డలిపెట్టుగా నిలుస్తున్నాయి. మనం... వాడు... మతం... దురహంకారం ప్రజలకు ప్రతిబంధకాలై జాతిని అతలాకుతలం చేస్తున్నాయి. ఆ మనోబలహీనతల్ని రాజకీయశక్తులు తమ స్వార్థప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి...

– ఆ ఆలోచనల నుండి బయటపడకముందే బాలాజీ ఇంటికి చేరుకున్నారు.

●

వచ్చి మూడురోజులైంది..!

స్నేహితుల మధ్య క్రిస్టమస్ పండగని బాగానే ఎంజాయ్ చేశాడు పీటర్. అందరూ కలిసి ఆనందంగా సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా అనిపిస్తోంది. ఏదో తన చిన్ననాటి స్నేహితుల మధ్య బాగానే జరిగిపోయింది గాని, లోలోపల అసంతృప్తిగానే ఉంది.

గుడిబండలో ఐకమత్యం కొరవడి, ద్వేషపూరిత వాతావరణం నెలకొంది. అదీ కేవలం రచ్చబండ దగ్గరి పోరంబోకు స్థలవివాదం... కొట్లాటలు జరుగుతున్నాయి. 'గుడి' అంటాడు ఒకడు, 'కాదు మసీదు' అంటాడు మరొకడు.

'ససేమిరా...' అని ఒక వర్గం అంటే– 'కట్టి తీరాల్సిందే!' అంటుంది మరో వర్గం. అంతా అతలాకుతలంగా అన్పిస్తోంది. చిన్ననాటి జ్ఞాపకాలను మనసు నిండా నింపుకొనివస్తే... ఆ బంగారు కల కరిగిపోతున్నట్లుంది.

"ముసలి అవ్వ మాటని ఆలోచించరా!" తిరుగు ప్రయాణానికి సిద్ధం కాబోతున్న పీటర్‌ని నిలేశాడు రసూల్.

"ఏదో ఆ ముసల్ది చెప్పడం... నేను ఆలోచించడం!" తేలిగ్గా నవ్వేశాడు.

"అవునురా! ఆ ఆలోచన మాకెవరికీ తట్టలేదు సుమా! మరలా నీకు ఈ ఉత్తరం వ్రాసి తన మనవడి చేత పంపింది తెల్సా!!"

"బాలమ్మ అమ్మ ఊరిలో అందరికన్నా వయసులో పెద్దది. శతాధిక వృద్ధురాలు. ఈమధ్యనే టీ.వీ.వాళ్ళు ఆమెను ఇంటర్వ్యూ చేసి వెళ్లారు" అవ్వ వ్రాసిన కాగితాన్ని అందిస్తూ అన్నాడు బాలాజీ.

వణుకుతూన్న చేతులతో వ్రాసిన ఆ అక్షరాలు అలికినట్లున్నాయి. పాపం... అతికష్టం మీద వ్రాసినట్లుంది. చదవడం కొంచెం ఇబ్బందిగానే ఉంది. కానీ, అవ్వలోని ఆర్తి ఆలోచనలో పడేస్తోంది పీటర్‌ని.

"నాయనా! నువ్వు డాక్టర్ అయ్యావంట... చాలా సంతోషం! మన ఊరి బుడతడు పెద్దడాక్టరు అంటే ఎంత ఆనందంగా వుందో! అదీ... మా కృపావరం కొడుకు. వాడు ఎంత మంచివాడో తెలుసా! ఎక్కడ, ఎవరికి, ఏ సహాయం కావాల్సివచ్చినా నేనున్నానని వాలేవాడు.

నా ఆరోగ్యం బాగోక తల్లడిల్లినప్పుడు కన్నకొడుకులా మీ నాన్న ఎన్నిసార్లు ధేనువుకొండ తీసుకెళ్లి వైద్యం చేయించాడో తెలుసా! మళ్లీ వాడి కొడుకు ఏకంగా డాక్టర్ అయి వచ్చినందుకు... చాలా బాగుంది నాన్నా! ప్రస్తుతం ఈ ఊరు చూశావు కదూ! కొట్టుకోవడాలు... పోలీసుస్టేషన్లూ... కోర్టుల కెక్కడాలు... అంతా అరాచకం! అదీ... కేవలం ఆ పోరంబోకు స్థలం కోసం.

ఊరిలో ఒక స్కూలు లేదు... హాస్పిటల్ లేదు. ఏదైనా అనారోగ్యం చేస్తే ప్రక్క ఊరికి పరుగెత్తాలి. కానీ, నాలుగు బ్రాందీషాపులు మాత్రం వెలిశాయి. పది సారాబట్టీలు తయారయ్యాయి. ప్రక్క ఊరికి పరుగెత్తే అవసరం లేకుండా ప్రభుత్వం పోలీసుస్టేషన్ని ప్రారంభించింది.

ఏ చిన్నరోగమొచ్చినా ఎంత అల్లాడిపోతున్నామో తెల్సా?! ముఖ్యంగా... నాలాంటి వయసు ఉడికిపోయినోళ్లం! ప్రస్తుతం ఈ ఊరికి మందిరం, మసీదు ముఖ్యం కాదు. ఆ పోరంబోకు స్థలంలో మానవత ఆలయ మనదగిన మానవ దేవాలయం నిర్మితం కావాలి.

మన ఊరివాడు డాక్టరయి వచ్చాడని ఊరు ఊరంతా నీకు జేజేలు పలుకుతోంది. నువ్వు ఇక్కడే డాక్టరుగా స్థిరపడాలని ఏకకంఠంతో కోరుకుంటోంది. ఏ స్థలమైతే శక్తుల స్వార్థమనోభావాలకు ఆలంబన అయిందో- అక్కడే నువ్వు మంచి హాస్పిటల్ నిర్మించాలని ఆశపడుతున్నాను.

తద్వారా ఊరిలో మతసామరస్యం నెలకొల్పిన వాడవవుతావు. ఆ మానవ దేవాలయంలో రోగాల బారిన పడుతున్న ఎందరో అభాగ్యులకు సేవలందించిన వాడవవుతావు. నీ ఈ మహాయజ్ఞానికి మొదటి విరాళంగా వెయ్యి రూపాయలు ఇస్తున్నాను. నేను ఇంతకుమించి ఇచ్చుకోలేని అశక్తురాలిని. బాలాజీ, రసూలు మంచి యువకులు. అటువంటి యువశక్తి నీకు వెన్నంటి ఉంటుందనుకుంటాను. ఈ ముసలి అవ్వది ఒట్టి అభ్యర్థన కాకూడదని అనుకుంటూ...

దీవెనలతో..."

పీటర్ మేను పులకించింది.

ప్రభాత రాగమేదో హృదయాన్ని తాకి ఆహ్లాదపరుస్తున్నాయి. అవ్వ మాటలు తన కర్తవ్యాన్ని గుర్తుకుతెస్తున్నట్లుంది. ఆచరణ స్థాయి నందుకుంటోంది.

'మదర్ థెరిస్సా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' అప్పటికప్పుడు పీటర్ మదిలో రూపుదిద్దుకుంటున్న ఆలోచనా క్రమం అతని ముఖంలోను, నవ్వే చిరునవ్వులోను ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి బాలాజీ, రసూల్‌లకు.

*'విశాలాంధ్ర' దినపత్రిక (ఆదివారం అనుబంధం) ... 19 ఫిబ్రవరి' 2006*